క్లుప్తంగా

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ సుజాత

గొలుగొండ: ఏఎల్‌పురంలో పంచాయతీ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లోచల సుజాత మాట్లాడుతూ గ్రామంలో తాగునీరు సమస్యతోపాటు, పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వార్డు మెంబర్లు నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాలకవర్గం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజేష్, ఎంపీటీసీ బుల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

5న ఏఎంసీ సభ్యుల ప్రమాణ స్వీకారం

మాడుగుల రూరల్: మాడుగులలో ఈ నెల 5న మార్కెట్ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారని ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరవుతారన్నారు. నియోజకవర్గంలో నాలుగు మండలాలకు చెందిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

గాలికుంటు నివారణే లక్ష్యం



శంకరంలో టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

మాడుగుల: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణే లక్ష్యంగా ప్రభుత్వం ఉచితంగా వ్యాక్సిన్లు అందిస్తుందని ఏడీ వి.చిట్టినాయుడు తెలిపారు. మండలంలో శంకరం, కొత్తవలస, వీరానారాయణం, చింతలూరు, కేజేపురం, పొంగలిపాక గ్రామాల్లో మంగళవారం పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయా గ్రామాల్లో 383 పశువులకు ఉచితంగా వ్యాక్సిన్లు వేశామన్నారు. మండలానికి 16,450 డోసులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాడిరైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చీడికాడ: మండలంలోని పలు గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు చీడికాడ పశువైద్యాధికారి గాయిత్రి దేవి తెలిపారు. మంగళవారం ఖండివరం, చీడికాడ, పెదగోగాడ, శిరిజాం గ్రామాల్లో 580 పశువులకు టీకాలు వేశామన్నారు. ఈ కార్యక్రమం ఈ నెలాఖరు వరకు కొనసాగుతుందన్నారు. ఆయా ఆర్బీకేల ద్వారా రైతులకు ముందస్తు సమాచారం అందిస్తామన్నారు.

నాణ్యమైన బోధన అందించాలి



ఎంఈవోలకు శుభాకాంక్షలు చెబుతున్న ఏపీటీఎఫ్ మండల నాయకులు

రోలుగుంట: స్థానిక ఎమ్మార్సీ భవన్ వద్ద మంగళవారం సాయంత్రం ఎంఈవోలు జాను ప్రసాద్, జగ్గారావులను ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు పి.రమణ, ప్రధాన కార్యదర్శి బోనెల రాము, ప్రధాన సలహాదారు కె.అశోక్ సామ్రాట్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులను, సభ్యులను ఎంఈవోలు అభినందించారు. ప్రతి ఉపాధ్యాయుడు సమయపాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన బోధనందించి విద్యా శాఖకు మంచిపేరు తేవాలని సూచించారు.

రెండు పాడిగేదెల మృతి



మృతి చెందిన పాడిగేదెలు

చీడికాడ: అర్జునగిరిలో మంగళవారం తెల్లవారు జామున రూ.60 వేలు విలువ చేసే రెండు పాడి గేదెలు మృతి చెందాయి. సర్పంచ్ బి.రమాదేవి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెంటకోట పైడిబాబుకు చెందిన గేదెలు సోమవారం సాయంత్రం విషాహారం తిన్నాయి. మంగళవారం రాత్రి వాటి పొట్టలు ఉబ్బడంతో వెటర్నరీ అసిస్టెంట్‌ను తీసుకొచ్చి వైద్యం చేయించారు. తెల్లవారుజామున నోటి వెంట సొంగలు కక్కుకుని మృతి చెందాయి. నిరుపేద రైతు వీటిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. ఒకేసారి రెండు పశువులు మృతి చెందడంతో బోరుమంటున్నాడు.



చోడవరం: మల్లాంలో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ



మాడుగులలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు ప్రసాదపాత్రుడు, లీలాప్రసాద్



రావికమతం: కార్యక్రమంలో వైద్యం చేస్తున్న వైద్యాధికారి అశోక్‌కుమార్



చోడవరం: రోగులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యుడు ప్రదీప్, సిబ్బంది

ప్రజారోగ్య పరిరక్షణే సీఎం ధ్యేయం

- జగనన్న ఆరోగ్య సురక్ష –2 ప్రారంభోత్సంలో విప్ ధర్మశ్రీ
- మల్లాంలో 202 మందికి వైద్య సేవలు

బుచ్చెయ్యపేట: రాష్ట్రంలో ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మల్లాంలో పార్టీ నాయకులు, అధికారులతో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంత సంపాదన ఉన్నా, ఆరోగ్యం లేకపోతే సుఖంగా ఉండలేరన్నారు. ఆరోగ్యంగా ఉంటే కుటుంబమంతా సంతోషంగా ఉండొచ్చని తెలిపారు. ప్రజల ఆరోగ్యం కోసం జగనన్న కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి గ్రామాల్లోనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయిస్తున్నారన్నారు. 30 మందికి పైగా సిబ్బందితో కార్పొరేటు స్థాయి వైద్య సేవలు, మందులు ఉచితంగా అందిస్తున్నారన్నారు. జబ్బుతో మంచం పట్టిన రోగులను వైద్య శిబిరానికి తీసుకొచ్చి పూర్తిస్థాయిలో వారికి వైద్య సేవలందేలా చూడాలని విప్ ధర్మశ్రీ సూచించారు. స్పెషలిస్టు వైద్యుల సేవలు, మందుల సరఫరాపై వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన మల్లాం, పెద మల్లాం, గంగాదేవిపేట గ్రామాలకు చెందిన 202 మంది రోగులకు వైద్యులు సంధ్యారాణి, మల్లికార్జునరావు, గౌతం నందన్ తమ సిబ్బందితో పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. డీపీవో శిరీషారాణి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, ఎంపీడీవో సువర్ణరాజు, పార్టీ మండలాధ్యక్షుడు జోగా కొండబాబు, సర్పంచ్ బర్ల శివ, నాయకులు అప్పాన రామారావు, గార్లపాటి రమణ, భర్నికాల మాలిబాబు, గొలగాని లోవరాజు పాల్గొన్నారు.



బుచ్చెయ్యపేట: ఆరోగ్య సేవలు, మందుల సరఫరాపై వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ

మాడుగుల: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష నేడు పేదల పాలిట వరంగా మారిందని ఎంపీపీ వేమవరపు రామధర్మజ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్సీఎం పాఠశాల ఆవరణలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 175 మంది రోగులను వైద్యాధికారులు ప్రసాద్‌పాత్రుడు, సంతోష్‌కుమార్, లీలాప్రసాద్, నరేష్ పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా ఆప్తాలమిస్ట్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఆరుగురు కంటి రోగులకు సర్పంచ్ ఎడ్ల కళావతి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, పంచాయతీ ఈవో నాయుడు, సీహెచ్‌వో సీహెచ్ పుష్పమ్మ, హెచ్‌వీ వెంకటరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రావికమతం: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాలు మంగళవారం మండలంలో ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా దొండపూడి శిబిరంలో కీళ్లనొప్పులు, జ్వరం, ఆస్తమా రోగులతోపాటు సాధారణ సమస్యలకు మొత్తం 426 మంది హాజరయ్యారు. వీరికి చోడవరం సీహెచ్‌సీ వైద్య నిపుణులు స్మృతి, అశోక్‌కుమార్, కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారి రజిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మండల ప్రత్యేకాధికారి రవికుమార్, ఎంపీడీవో వెంకన్నబాబు, కొత్తకోట ఆరోగ్య విస్తరణాధికారి పాతాళ రామారావు, సర్పంచ్ రాజులమ్మ, ఉప సర్పంచ్ రాజారావు పాల్గొన్నారు.

చోడవరం: జగన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. నేరుగా ప్రజల వద్దకే వైద్య బృందం వచ్చి వైద్య సేవలు చేసి మందులు అందించడంతో రోగులు ఆనందం వ్యక్తం చేశారు. చోడవరం పంచాయతీ యడ్లవీధి సచివాలయం–3 పరిధిలో జీ స్ట్రీట్ పాఠశాల ఆవరణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ఆధ్వర్యంలో ఐదుగురు వైద్యులతో కూడిన బృందం సాధారణ ఆరోగ్య సమస్యలతోపాటు కంటి వైద్య సేవలు అందించింది. 286 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేసింది. శిబిరాన్ని సందర్శించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఇక్కడ అందిస్తున్న వైద్య సేవలు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అభివృద్ధి సంక్షేమంతోపాటు ప్రజల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకున్న ఏకైక ప్రభుత్వం తమదే అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో శ్యామ్ సుందర్, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నారాయణరావు, సర్పంచ్ బండి నూకాలమ్మశ్రీను, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు బొగ్గు శ్యామల, సచివాలయం కార్యదర్శి విజయ పాల్గొన్నారు.



మాడుగుల: ఆర్సీఎం పాఠశాలలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎంపీపీ రామధర్మజ



రావికమతం: రోగికి మందులు అందిస్తున్న ప్రత్యేకాధికారి రవికుమార్



నాతవరం: రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు



నాతవరం: మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

నాతవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరం లాంటిదని సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు తెలిపారు. పీకే గూడెం సచివాలయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎంపీడీవో హనుమంతరావు ఆధ్వర్యంలో బుక్‌లెట్లను ఆవిష్కరించి రోగులకు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో వైద్యాధికారులు లత, మల్లిఖార్జునరావు, చక్రధరరావు 266 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అన్ని వర్గాల ప్రజలకు స్థానికంగానే ఉచిత వైద్య సేవలు అందించడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో పి.జగ్గంపేట సర్పంచ్ జివిరెడ్డి సోమన్నదొర, ఎంపీటీసీ గాడి దేవీరమేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి వరహాలబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్



అందుబాటులో ఉంచిన పరీక్షల మెటీరియల్



విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ అందజేస్తున్న హెచ్‌ఎం సుందర్‌సింగ్

చోడవరం రూరల్: గ్రూప్స్ ఇతర పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు శుభవార్త. స్థానిక అంబేడ్కర్ భవన్‌లోని గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సంసిద్ధం కావడానికి ఉపకరించే స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచినట్టు డాక్టర్ డి.ఆర్.అంబేడ్కర్ ట్రస్టు ఫౌండర్ చైర్మన్ నడుపూరి సన్యాసిరావు తెలిపారు. గ్రూపు పోటీ పరీక్షలతోపాటు భారత నావికాదళ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఉపకరించే స్టడీ మెటీరియల్‌ను తెలుగులో మూడు సెట్లు, ఆంగ్ల మాధ్యమంలో ఒక సెట్ వివిధ రకాల పబ్లిషర్ల పుస్తకాలను ట్రస్టు సభ్యుడు కండెల వెంకటరావు వితరణ చేశారన్నారు. ఆరు వేల రూపాయల విలువ చేసే ఈ మెటీరియల్ గ్రంథాలయంలో అందుబాటులో ఉంచామన్నారు.

పది విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ పంపిణీ

చోడవరం రూరల్: గవరవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు 30 మందికి హెచ్‌ఎం జి.జె.సుందర్‌సింగ్ మంగళవారం పరీక్షల మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేశారు. పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్న ఆకాంక్షతో ఇంగ్లిషు ఉపాధ్యాయుడు జి.వి.రమణ రూ.ఆరు వేలతో వీటిని సమకూర్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తగా 100 పింఛన్ల మంజూరు

రోలుగుంట: కొత్తగా వంద మందికి పింఛన్లు మంజూరయ్యాయని ఈవోపీఆర్డీ తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెంచిన రూ.250తో కలిపి రూ.3 వేలు ఈ నెల నుంచే పంపిణీ చేస్తామన్నారు. పాత లబ్ధిదారులతో కలపి బుధవారం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొని ప్రారంభిస్తారన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం.. ఆంధ్రా పోటీలు



చీడికాడలో బాలికల ఖోఖో

చీడికాడ: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఆడుదాం.. ఆంధ్రా పోటీలు మంగళవారం కొనసాగాయి. మండలంలోని పలు సచివాలయాల పరిధిలో ఖో–ఖో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కొన్ని సచివాలయాల్లో వాలీబాల్, కబడ్డీ పోటీలు పూర్తయ్యాయని ఎంపీడీవో జయప్రకాష్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారిని మండల స్థాయికి ఎంపిక చేశామన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

దేవరాపల్లి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి



దేవరాపల్లిలో క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి

దేవరాపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అర్హులందరికీ పారదర్శకంగా అందుతున్నాయని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి తెలిపారు. మంగళవారం దేవరాపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల జీవితాల్లో వెలుగు నింపారన్నారు. ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్. ప్రభాకర్, ఎంఈవో–1 బి. పడాల్‌దాస్, పంచాయతీ సెక్రటరీ ఎస్. శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలతో అభివృద్ధి



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న విశ్వనాథరాజు

నాతవరం: సమాజం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే స్వచ్ఛంద సేవా సంస్థలు మరిన్ని కార్యక్రమాలు చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీవిశ్వనాథరాజు తెలిపారు. అమ్మవాసవీ స్వచ్ఛంద సేవా సంఘం మండల శాఖ అధ్యక్షురాలు ఇటంశెట్టి అక్కయ్యమ్మ ఆధ్వర్యంలో మంగళవారం నాతవరంలో 250 మంది పేదలకు దుస్తులు, 150 మంది పిల్లలకు పుస్తకాలు, సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేసే బాధ్యత అధికారులదే అన్నారు. అమ్మవాసవీ సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా అఖిల గాండ్ల జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి రవికుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, ఉపాధ్యక్షుడు యర్రంనాయుడు, పేలూరి బుల్లిదొర, మండలశాఖ అధ్యక్షుడు లాలం వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కరక అప్పలరాజు, మాజీ ఎంపీపీ నేతల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సమష్టిగా సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మాకవరపాలెం: సమస్యల పరిష్కారానికి అందరూ సమష్టిగా ఉండాలని ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు కోరారు. రాచపల్లి కామేశ్వరమ్మ ఆలయం వద్ద మంగళవారం ఆర్టీసీ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1-1-2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, ఈపీఎస్‌ను 95 నుంచి సీపీఎస్‌కు మార్చే గడువును ఎత్తివేయాలన్నారు. సంస్థ నుంచి ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను చెల్లించడంతోపాటు పలు డిమాండ్లను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి మోహన్, విజయనగరం జోనల్ కార్యదర్శి మూర్తి, జోనల్ నాయకులు సూర్యం, శంకర్రావు, రమణ, రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు రాజు, సుధాకర్ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి సారె ఊరేగింపు నేడు



కశింకోటలో మార్గశిర గురువార ఉత్సవానికి ఏర్పాట్లు

కశింకోట: కశింకోటలో ప్రసిద్ధి చెందిన కనక మహాలక్ష్మి అమ్మవారి సారె ఊరేగింపు బుధవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ భీశెట్టి కుమార్ మంగళవారం తెలిపారు. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా మహిళలు తయారు చేసిన స్వీట్లు, పండ్లు వగైరా అమ్మవారికి నివేదించి గ్రామ వీధుల్లో ఊరేగింపు జరగనుందన్నారు. నాలుగవ మార్గశిర గురువారం పురస్కరించుకుని భక్తులు, ప్రముఖుల భారీ సంఖ్యలో హాజరుకానుండటంతో, వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఆ రోజు మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన జరగనుందన్నారు.

ఆటో కార్మికులకు గుర్తింపు కార్డుల పంపిణీ



ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులు అందిస్తున్న లక్ష్మణ

బుచ్చెయ్యపేట: సీతయ్యపేట జంక్షన్ పరిధిలో ఆటో కార్మికులకు జిల్లా ఆటో కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. మంగళవారం సీతయ్యపేటలో ఆటో కార్మికుల సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని కోరారు. కర్ణాటక, తెలంగాణలో ఉచిత పథకాలు వల్ల అక్కడ ఆటో కార్మికులు వీధిన పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు నష్టం కలిగించే ఉచిత పథకాలను మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పిల్లా రాజు, కందేపల్లి జగన్, ఎస్‌కే రహమాన్, బంగారి రాజు, రవి, నాని, సురేష్, నాగరాజు పాల్గొన్నారు.

ఆశాజనకంగా కర్ర పెండలం సాగు

పలు గ్రామాల్లో 100 ఎకరాల్లో పంట



గరుగుబిల్లిలో కర్ర పెండలం పంట

కె.కోటపాడు: మండలంలోని మెట్ట ప్రాంత గ్రామాల్లో కర్ర పెండలం పంట ఆశాజనకంగా ఉంది. ప్రధానంగా ఈ సాగుకు చౌడు భూములు ఉపకరిస్తాయి. తక్కువ నీటి సాంద్రతతో భూ అంతరభాగంలో పండే పంట కావడంతోపాటు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో గరుగుబిల్లి, చౌడువాడ, గుల్లేపల్లి, యరకన్నపాలెం, దాలివలస, సింగన్నదొరపాలెం, డి.అగ్రహారం, కొరువాడ గ్రామాల్లో వంద ఎకరాలకుపైగా రైతులు సాగు చేస్తున్నారు. మార్కెట్‌లో కర్రపెండలం దుంపలకు మంచి డిమాండ్ ఉండటంతో సాగు లాభదాయకంగా ఉంటుందని చెబుతున్నారు.

7న విశాఖలో బీసీ చైతన్య సభ



చైతన్య సభ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కర్రి రామకృష్ణ

అనకాపల్లి: ఈ నెల 7న విశాఖలోని ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా కళాశాల క్రీడా మైదానంలో బీసీ సామాజిక చైతన్య సభ నిర్వహించనున్నట్లు ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కర్రి రామకృష్ణ తెలిపారు. స్థానిక ఉడ్‌పేట బీజేపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనంతరం చైతన్య సభ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు పడుతున్న ఇబ్బందుల్ని ఆలోచించి 18 రకాల చేతివృత్తులకు మొదటి విడతగా రూ.1300 కోట్లు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. చేతివృత్తులకు, బడుగు బలహీన వర్గాలకు ఆసరాగా ప్రధాని మోదీ ఎన్నో సంక్షేమ పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విశాఖలో జరిగే బీసీ సభకు జిల్లాలోని బీసీ సోదరులంతా హాజరుకావాల్సిందిగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కంచిపాటి వెంకట సన్యాసిరావు, రాష్ట్ర నాయకుడు అలమండ శ్రీను, పార్టీ అసెంబ్లీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఓరిగంటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపమాక వెంకన్న తిరువీధి సేవ



రాజాధిరాజ వాహనంపై స్వామివారు

నక్కపల్లి: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉపమాక వేంకటేశ్వర స్వామి రాజాధి రాజ వాహనంపై ఊరేగారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు నిత్యాభిషేకాలు అర్చన లు నిర్వహించారు. రాజాధి రాజవాహనంలో స్వామివారిని, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి తిరువీధి సేవ నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో తిరుప్పావై వ్రతంలోను ఉన్న మదగలిత్తన్ ఓడాద తొళ్ళులైయ్యున్ 18వ పాశురాన్ని విన్నపం చేశారు. అనంతరం తీర్థ గోష్టి ప్రసాద వినియోగం నిర్వహించారు. సాయంత్రం నిత్య కార్యక్రమాలు యధావిధిగా నిర్వహించారు.

బీసీ సామాజిక చైతన్య సభకు ఆహ్వానం

అనకాపల్లి: జిల్లా కార్మిక శాఖ కమిషనర్ బాలకృష్ణను ఆయన కార్యాలయంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కంచిపాటి వెంకట సన్యాసిరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 7న జరిగే బీసీ సామాజిక చైతన్య సభకు ఆహ్వాన పత్రం అందించారు. ఆయన వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్రి రామకృష్ణ, సభ్యుడు కొండబాబు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.